జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
05 శనివారం సెప్టెంబర్, 2026 పేజీలు:11



02లో

## "ఆరు గ్యారంటీలు ఆరు మాటలేనా."

కాంగ్రెస్ సర్కార్ పై మాజీ ఎం ఎల్ ఎ కొప్పుల మహేష్ రెడ్డి వ్యంగాస్త్రం
దేశాయి పల్లి x రోడ్డు లో భారీ ధర్నా



# "పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేనివి.. వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ చేసి చూపించింది"

## - దేవరకద్ర నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 4**

**( ప్రజా జ్యోతి బ్యూరో ):**
పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దేవరకద్ర నియోజకవర్గానికి జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లో చేసి చూపించిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలన 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మదనపురం, కొత్తకోట మండలాల్లో నిర్వహించిన భారీ సంబరాలు, బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు.

**వెయ్యి రోజుల్లో పలు అభివృద్ధి పనులు:**

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో దేవరకద్ర నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు 48 వేల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, అర్హులకు కొత్త రేషన్ కార్డులు, ఉచిత సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.మదనపురంఆత్మకూరు మధ్య రూ.6 కోట్లతో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశామని, రూ.కోటి నిధులతో శంకరపేటదంతనూర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు రూ.5 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు.దేవరకద్రలో 100 పడకల ఆసుపత్రి, కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి, దేవరకద్రలో డిగ్రీ కళాశాల, చిన్నచింతకుంటలో జూనియర్ కళాశాల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సాయం, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లతో రుణమాఫీ చేసినట్లు తెలిపారు.

**బీఆర్ఎస్ హామీలపై విమర్శలు:**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామనే హామీ, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు మూడెకరాల భూమి, 12 శాతం రిజర్వేషన్లు వంటి హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి విమర్శించారు.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించిన ఆయన.. పాలమూరు బిడ్డ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. "అభివృద్ధికి ఓటు.. ప్రజా పాలనకు జై" అంటూ కాంగ్రెస్ శ్రేణులు నినదించాయి. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# “ఆరు గ్యారంటీలు ఆరు మాటలేనా.“

## కాంగ్రెస్ సర్కార్ పై మాజీ ఎం ఎల్ ఎ కొప్పుల మహేష్ రెడ్డి వ్యంగాస్త్రం

## దేశాయి పల్లి × రోడ్డు లో భారీ ధర్నా

**మహమ్మదాబాద్ సెప్టెంబర్ 4(ప్రజా జ్యోతి )**

మహమ్మదాబాద్ మండల టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాలబి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కొప్పుల మహేష్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తనదైన శైలిలో విమర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను నిరుద్యోగులను రైతులను సైతం మోసం చేస్తోందని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ వంటి పథకాలు బీద ప్రజలకు అందకుండా వారి నోట్లో మట్టి కొట్టే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు కేవలం గెలవడం కోసమే 6 గ్యారంటీల పథకం అమలు చేస్తామని అబద్దాల హామీలతో ప్రజలను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. 6 గ్యారంటీలు కాదు కాంగ్రెస్ పార్టీ ఆరు మాటలతో ప్రజలను మభ్యపెట్టి కాలయాపన చేస్తుందని తీవ్రస్థాయిలో విమర్శించారు ఈ కార్యక్రమంలో పలువురు టీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమానికి మండలంలోని గాదిరాల్ నంచర్ల దేశాయిపల్లి చౌదర్పల్లి మంగంపేట్ తదితర గ్రామాల బి ఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు టిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమంలో పాల్గొనడంతో దేశాయిపల్లి ఎక్స్ రోడ్డు మొత్తం గులాబీ మయంగా మారింది ధర్నాలో పాల్గొన్న వారిలో మహమ్మదాబాద్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ణ గోపాల్ టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకట్రామిరెడ్డి తో పాటు మండలంలోని మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మరియు పార్టీ కార్యకర్తలు ఉన్నారు.






# నేడు నర్వలో పాలవుట్ల ఉత్సవాలు

## - శ్రీ శ్రీ శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం వద్ద


**నర్వ సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని వేణు గోపాల స్వామి దేవాలయం వద్ద నేడు పాలవుట్ల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గోకుల్ సింగ్, రవీందర్ సింగులు శుక్రవారం ఒక ప్రకటనలు తెలిపారు, మధ్యానం 1:00 గంటలకు అన్న ప్రసాద కార్యక్రమంసాయంత్రం 3: 00 గ! పాలా ఉట్లలికార్యక్రమం అనంతరం పల్లకి సేవ మరియ రథోత్సవంతేదీ:-06 - 09 - 2026 సాయంత్రం 4:00 గా! బొనకుండం అనంతరం పల్లకి సేవ మరియ రథోత్సవంతేదీ:-07 - 09- 2026 రోజు రాత్రికి ప్రత్యేక పూజలు మరియు వేణుగోపాల స్వామి వారి ఊయల సేవకావున గ్రామ పెద్దలు, మహిళలు భజనపరులు, వివిధ గ్రామాల ప్రజలు, హిందూ బంధువులు అధిక సంఖ్యలో అందరూ పాల్గొని ఈ పాలవుట్ లవ్ సవాలని తొలగించ గలరని నిర్వాహకులు తెలిపారు

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## బీఆర్ఎస్ నేత బాసు హనుమంతు నాయుడు



**మల్దకల్ సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శుక్రవారం మల్దకల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.మల్దకల్ బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిపై వంటావార్పు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.వికలాంగులు, మహిళలు,విద్యార్థులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు.అంతకుముందు శ్రీశ్రీశ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులు,వృద్ధులు,మహిళలు,విద్యార్థులతో పాటు అన్ని వర్గాలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు.పుట్టిన బిడ్డకు అందాల్సిన కేసీఆర్ కిట్ నుంచి విద్యార్థులకు ఫీజు కార్డులు,యువతులకు స్కూటీలు,వివాహమైన మహిళలకు రూ.1,00,116తో పాటు తులం బంగారం,ఆసరా పింఛన్లను రూ.4 వేలకు,దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు.పుట్టిన బిడ్డ నుంచి పండు వృద్ధుల వరకు,విద్యార్థుల నుంచి రైతులు,రైతు కూలీలు,ఆటో కార్మికుల వరకు ప్రతి వర్గానికి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలును విస్మరించిందని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ ఉందో బీఆర్ఎస్ శ్రేణులు ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రతి కాంగ్రెస్ నాయకుడిని హామీల అమలుపై నిలదీసి,ప్రజలకు రావాల్సిన హక్కులను సాధించుకునేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.ప్రజలకు అండగా బీఆర్ఎస్ నిలుస్తుందని,ప్రభుత్వం హామీల అమలుపై స్పందించే వరకు ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు,మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల,జి.రాఘవేంద్రరెడ్డి,పటేల్ జనార్దన్‌రెడ్డి,ప్రతాప్,డి.శేఖర్ నాయుడు,సర్పంచులు సత్యాన్న,సాకి డేవిడ్,భరత్ సింహారెడ్డి,తిరుమలేష్,బాసు గోపాల్,వెంకటేష్ నాయుడు, మధుకుమార్, ఆంజనేయులు, సి.కె.రంగన్న, మాలిక్, రమేష్, నాగరాజు,లక్ష్మారెడ్డి, శ్రీను, చంద్రశేఖర్,రాముడు,మల్లికార్జున్,మహేందర్,నరేష్,నరసింహులు,ఓబులేష్‌తో పాటు సీనియర్ నాయకులు,వివిధ గ్రామాల పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీకాల వివరాలను యు-విన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి

## జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.జె.సంధ్యా కిరణ్మయి



**గద్వాల సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు,సంబంధిత సిబ్బంది చిన్నారులకు వేసిన టీకాల వివరాలను యు-విన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.జె.సంధ్యా కిరణ్మయి సూచించారు.జాతీయ స్థాయిలో టీకాల కార్యక్రమం అమలు తీరును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు,టీకాలు పొందిన ప్రతి చిన్నారి వివరాలను యు-విన్ పోర్టల్‌లో నమోదు చేయడం ఎంతో కీలకమని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.అస్గర్ అలీ తెలిపారు.పిల్లలకు పుట్టిన నాటి నుంచి 17 సంవత్సరాల వయస్సు వరకు జాతీయ టీకాల కార్యక్రమం ప్రకారం నిర్దేశించిన అన్ని రకాల టీకాలను సకాలంలో వేయించాలని సూచించారు.భౌతికంగా టీకా వేసిన వెంటనే సంబంధిత వివరాలను యు-విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని,ఎలాంటి వివరాలు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు,సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.టీకాల నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహించకుండా,యు-విన్ పోర్టల్‌లో వివరాలు ఎప్పటికప్పుడు నవీకరించాలని వారు సూచించారు.

# ఏవీఆర్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

## చిన్నారుల మురళీధరుడి వేషధారణలు, నృత్యాలు, నాటకాలతో ఆకట్టుకున్న వేడుకలు

**గండీడ్:**

గండీడ్‌లోని ఏవీఆర్ గ్లోబల్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణల్లో ముస్తాబై చేసిన నృత్యాలు, మురళీధరుడి పాత్రలు, పౌరాణిక నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు శ్రీకృష్ణుడి బాల్యలీలలు, గోపికలతో కృష్ణుడి అనుబంధం, ధర్మంన్యాయం ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల నృత్యాలు, పాటలు, వేషధారణలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో ఆనందాన్ని నింపాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో శ్రీకృష్ణుడి జన్మదిన విశిష్టతను, భగవద్గీత సందేశాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ చి. వెంకటస్వామి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చిన్ననాటి నుంచే విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో నైతిక విలువలు, సంస్కృతిపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య సభ్యులు వెంకట్రాములు, రమేష్, మధుసూదన్, ప్రిన్సిపాల్ అంజయ్య గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. చిన్నారుల అద్భుత ప్రదర్శనలకు కార్యక్రమానికి హాజరైన వారు అభినందనలు తెలిపారు.



# పేద కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అండ

## - కిడ్నీ మార్పిడి చికిత్సకు రూ.5 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ

**గద్వాల(ప్రజా జ్యోతి)సెప్టెంబర్ 04:**

జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన యం.భగవాన్ జి కుమారుడు యం.ఉదయ్ సాయి కిడ్నీ బాధతో కొన్ని ఏండ్లు ఇబ్బందులు గురికాగా కిడ్నీ మార్పిడి చికిత్స కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు చేసింది.హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఉదయ్ సాయి కుటుంబానికి ఎల్ఓసీ పత్రాన్ని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే,ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ అందజేశారు.ఈసందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ,పేద,సామాన్య ప్రజలకు వైద్య సహాయం అందించడమే ప్రజా పాలన లక్ష్యమన్నారు.ఉదయ్ సాయి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులో అవసరమైన సహాయాన్ని అందిస్తామని కుటుంబానికి భరోసా ఇచ్చారు. తమ కుమారుడి చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంపత్ కుమార్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు - 2026

## - మహబూబ్‌నగర్ జిల్లాలో నేడు ఘనంగా ప్రదానోత్సవం

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారి కృషిని ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో "జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు - 2026" ప్రదానోత్సవ కార్యక్రమం నేటి (05-09-2026) సాయంత్రం 3 గంటలకు స్థానిక ఐ.డి.ఓ.సి. (కలెక్టరేట్ సమావేశ మందిరం)లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయనున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో వివిధ మండలాల నుంచి ఎంపికైన 69 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఈ పురస్కారాలు దక్కనున్నాయి. విద్యా బోధనలో ప్రతిభ కనబరిచిన ఎస్జీటీ, ఎస్ ఏ, జీహెచ్ఎం, పీఇటీ తదితర హోదాల్లోని ఉపాధ్యాయులను బాలానగర్, భూత్పూర్, సి.సి.కుంట, దేవరకద్ర, గండీడ్, హన్వాడ, జడ్చర్ల, కొయిల్‌కొండ, మహబూబ్‌నగర్ (గ్రామీణ/పట్టణ), మిడ్జిల్, మహమ్మదాబాద్, ముసాపేట్, నవాబ్‌పేట్, రాజాపూర్ మండలాల నుంచి ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం సూపరింటెండెంట్ బోగాది మురళి మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి, ఇతర అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొననున్నారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు తెలిపారు.

# పాన్‌షాప్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

## - మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

**గద్వాల సెప్టెంబర్ 04 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

పట్టణంలోని విష్ణుప్రియ హోటల్ సమీపంలో ఆగస్టు 31న ఉదయం పాన్‌షాప్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు.ఈ కేసులో అనుమానితుడిని అదుపులోకి తీసుకుని,అతని నుంచి మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు.శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అతని పేరు అశోక్ (వనపర్తి) అని,పాన్‌షాప్‌లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు ఎస్ఐ తెలిపారు.నిందితుడి నుంచి మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని,అనంతరం అతడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కల్యాణ్‌కుమార్ పేర్కొన్నారు.



# కాంగ్రెస్ దగా పాలనపై భూత్పూర్‌లో గర్జించిన గులాబీ సైన్యం

**- ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలంటూ బీఆర్ఎస్ భారీ ర్యాలీధర్నా**
**- "హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం" మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భూత్పూర్ మండల కేంద్రంలో శుక్రవారం భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఆల ప్రీతి రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వృద్ధులు, రైతులు, విద్యార్థులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భూత్పూర్ పట్టణం గులాబీమయంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భూత్పూర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ముందుగా నిర్వహించిన వంటా వార్పు కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పని అయిపోయింది: శ్రీనివాస్ గౌడ్


ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని, కేసీఆర్ హయాంలో అమలైన అనేక సంక్షేమ పథకాలను నిలిపివేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కూడా ప్రజల్లో అసంతృప్తి నెలకొందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసం ప్రజలకు అర్థమైందని, ఆ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి, ఆయన సోదరుల అవినీతిపై కాంగ్రెస్ నేతలే మాట్లాడుతున్నారని ఆరోపించిన శ్రీనివాస్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, వాటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్‌కు పిండం పెట్టే రోజు దగ్గర్లోనే: ఆల

మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టే రోజు దగ్గర్లోనే ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ సైన్యం తిరగబడితే ఎలా ఉంటుందో భూత్పూర్ కార్యక్రమంతో చూపించామని అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న కవ్వింపు చర్యలను తిప్పికొడుతున్నామని, ఇలాంటి చిల్లర ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. తాము హామీల అమలు కోరుతున్నామని, హామీలు అమలు చేస్తే బీఆర్ఎస్ నాయకులు రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రజలకు బాకీ పడిన హామీలు, నిధులను చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, వికలాంగులు, నిరుద్యోగులు, మహిళలు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పనులను పెండింగ్‌లో పెట్టారని, కృష్ణా జలాలను వినియోగించుకుని రైతులకు సాగునీరు అందించే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ప్రజల సంక్షేమం, పాలన, అభివృద్ధిపై ప్రభుత్వానికి సోయి లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, అక్రమ కేసులకు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు అన్నింటికీ సమాధానం చెబుతామని అన్నారు. ప్రజలు కేసీఆర్‌ను ప్రతిరోజూ జ్ఞాపకం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

### దేవరకద్ర బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ అభినందనలు:





భూత్పూర్ ధర్నా కార్యక్రమంలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ ద్వారా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డితో మాట్లాడి దేవరకద్ర నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులను అభినందించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాడుతున్న దేవరకద్ర బీఆర్ఎస్ సైన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే దేవరకద్ర నియోజకవర్గానికి వచ్చి పార్టీ శ్రేణులను కలుస్తానని కేటీఆర్ తెలిపారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదని పేర్కొంటూ, ఇదే స్ఫూర్తితో ప్రజల పక్షాన పోరాటాన్ని కొనసాగించాలని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ సూచించినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

# ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి నిధులతో వెన్నచేడ్‌లో 'బోర్ల జాతర'

## 4 బోర్లు.. 100% సక్సెస్! పుష్కలంగా నీటి ధారలు..

### తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

**గండీడ్, సెప్టెంబర్ 4:**

గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవతో చేపట్టిన బోర్ల తవ్వకం పనులు విజయవంతమయ్యాయి. ఎంపీ నిధులతో గత రెండు రోజులుగా చేపట్టిన పనుల్లో 4 బోర్లు వేయగా నాలుగు బోర్లలోనూ సమృద్ధిగా నీరు పడటంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.తాజాగా గణేష్‌నగర్ కాలనీలో వేసిన మూడో బోరు, శ్రీరామ్‌నగర్ కాలనీలో వేసిన నాలుగో బోరు సైతం విజయవంతమై పుష్కలంగా నీరు లభించింది. దీంతో ఏళ్లుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులకు ఊరట లభించింది.ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి నిధులతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం పట్ల వెన్నచేడ్ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు డా. వెన్న ఈశ్వరప్పకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య, గ్రామ పెద్దలు జి. రాములు, భాస్కర్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డమీది మల్కయ్య, మాజీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు చాకలి బాలయ్య, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు దొడ్డే రాములు, మాజీ ఎంపీటీసీ రేణుక దశరథ్, వార్డు సభ్యులు కాకి ఆంజనేయులు, సాయిలు, చెన్నయ్య, బీజేపీ నాయకులు రాములు, గోపాల్, నరేందర్, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, అంజి, గ్రామ పరిశుద్ధ కార్మికులు, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.ష



# జగదీశ్వర్ రెడ్డి ఆశయాల సాధనే లక్ష్యం: యెన్నం

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మాజీ ఎమ్మెల్సీ స్వర్గీయ ఎస్. జగదీశ్వర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ మహబూబ్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పద్మావతి కాలనీలోని గ్రీన్‌బెల్ట్‌లో జగదీశ్వర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన, తెలంగాణ రాష్ట్ర సాధనలో జగదీశ్వర్ రెడ్డి చూపిన పట్టుదల, చొరవ చిరస్మరణీయమని కొనియాడారు. పార్టీలకు అతీతంగా ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మిథున్ రెడ్డి

### - ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్ష

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీ యాదవ కమిటీ హాల్‌లో యాదవ సోదరులు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మూడ్ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్‌లతో కలిసి మిథున్‌రెడ్డి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతియుతంగా జీవించాలని ఆకాంక్షించారు.కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా యాదవ సోదరులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణుడి బోధనలు, ధర్మమార్గం సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# పేదింటి పెళ్లికి అండగా కార్పొరేటర్ గుండా సంతోష్

## వివాహ కానుకగా రూ.21 వేల ఆర్థిక సహాయం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**




పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న 21వ డివిజన్ కార్పొరేటర్ గుండా సంతోష్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. 21వ డివిజన్ పరిధిలోని ఊరగుట్ట ప్రాంతానికి చెందిన రఘురాములువరలక్ష్మి దంపతుల కుమార్తె వివాహం సందర్భంగా వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న కార్పొరేటర్ గుండా సంతోష్ రూ.21,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, ఈ మొత్తాన్ని వివాహ కానుకగా అందించారు. ఈ సందర్భంగా గుండా సంతోష్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ప్రజా సేవలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తానన్నారు. ఆర్థిక సహాయం అందించినందుకు కుటుంబ సభ్యులు కార్పొరేటర్ గుండా సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు సైతం ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, బాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జగదీశ్వర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

## 6వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**మహబూబ్‌నగర్ నగరం, సెప్టెంబర్ 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మాజీ ఎమ్మెల్సీ స్వర్గీయ సుంకిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ, ప్రజా సేవలో ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, సమాజ అభివృద్ధికి జగదీశ్వర్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి, అంకితభావం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజా సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు పిలుపునిచ్చారు. జగదీశ్వర్ రెడ్డి సేవలను నిరంతరం స్మరించుకుంటూ, ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.



# పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

**ప్రతి గ్రామంలో సాయన్న విగ్రహాలు ఏర్పాటు చేస్తాం: ముదిరాజ్ సంఘం నాయకులు**

**గండీడ్:**

ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన పండుగ సాయన్న విగ్రహాన్ని గండీడ్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసేందుకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ పండుగ సాయన్న చరిత్ర, ఆయన చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికీ తెలిసేలా భవిష్యత్‌లో ప్రతి గ్రామంలో సాయన్న విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. పేదల ఆకలి తీర్చిన మహనీయుడిగా, భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచి పోరాడిన యోధుడిగా పండుగ సాయన్నను కొనియాడారు. రెడ్డిపల్లి గ్రామంలో సాయన్న విగ్రహ ఏర్పాటుకు అన్ని వర్గాలకు చెందిన గ్రామ పెద్దలు సహకరించడం శుభపరిణామమని అన్నారు. విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ గండీడ్ మండల ముదిరాజ్ సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గండీడ్ మండల ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి కేశవులు, గిరమోని అంజిలయ్య, బంటు నర్సప్ప, బంటు సాయిలు, గిరమోని వెంకటయ్య, రామచంద్రయ్య, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గొల్ల సాయిలు, గోపాల్, వెంకటయ్య, బోడి వెంకటయ్య, ఆంజనేయులు, రెడ్డిపల్లి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# 1000 రోజుల కాంగ్రెస్ పాలన.. హామీల అమలేది?

**ఆరు గ్యారంటీలు.. 420 హామీలపై బీఆర్ఎస్ ధ్వజం**

**గండీడ్‌లో నిరసన, కొప్పుల మహేష్‌రెడ్డి ఫైర్**

**గండీడ్:**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గండీడ్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తగిన దృష్టి సారించడం లేదని విమర్శించారు. రైతులకు సమయానికి యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారని, రైతు భరోసా, పంటలకు గిట్టుబాటు ధర వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఇచ్చిన హామీలు, పేదలకు ఇళ్ల విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించిన ఆయన.. హామీల అమలు జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# మార్గదర్శి విద్యాలయంలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**- ఆకట్టుకున్న చిన్నారుల కృష్ణ, గోపికల వేషధారణలు**

**- ఘనంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు**

**మాగనూరు, సెప్టెంబర్ 4(ప్రజా జ్యోతి)**

మాగనూరు మండల కేంద్రంలోని మార్గదర్శి విద్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. జన్మాష్టమిని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహానికి పండితుల వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాట నృత్యాల నడుమ శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాల ఊరేగింపు గ్రామంలోని పురవీధుల గుండా ఘనంగా సాగింది. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చేసిన నృత్యాలు, భక్తి పాటల ప్రదర్శనలు గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఊరేగింపు అనంతరం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన 'పాల ఉట్టి కొట్టే' కార్యక్రమం విద్యార్థుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి. నరసింహులు, మేనేజ్మెంట్ అధ్యక్షులు జి. ప్రహ్లాద రెడ్డి, ఉపాధ్యాయులు వనిత, వెంకట గౌడ్, మహేష్, ఆకాష్ గౌడ్, నర్మద, రేణుక, నాగేశ్వరి, మహేశ్వరి, శ్రీకాంత్, నరసమ్మ మరియు విద్యార్థినీవిద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు..



# “హామీలతో మహిళలను మోసం చేశారు..

## ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదు”

### - బీఆర్ఎస్ వంటావార్పు కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధ్వజం




**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో మహిళలు తీవ్రంగా మోసపోయారని, రాష్ట్రంలో మహిళలకు రక్షణ, గౌరవం కొరవడిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. మహిళలపై వేధింపులు, హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. అంతకుముందు పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా తెలంగాణ కూడలి వరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.4 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పిందని విమర్శించారు. తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడంతో పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలు భారంగా మారాయని, కళ్యాణలక్ష్మి పథకం కూడా సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో అమలు చేసిన పథకాలను ప్రస్తావిస్తూ, కేసీఆర్ కిట్ ద్వారా గర్భిణులు, బాలింతలకు అండగా నిలిచామని అన్నారు. ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగ పిల్లవాడు పుడితే రూ.12 వేల ప్రోత్సాహంతో పాటు కేసీఆర్ కిట్ అందించామని తెలిపారు. మహిళలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఇంటింటికీ నల్లా ద్వారా నీటిని అందించామని, మహిళలకు స్కూటీలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోతున్నాయని, పెన్షన్లు సక్రమంగా అందడం లేదని మహిళలు తమ దృష్టికి తీసుకొస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రైతు కుటుంబాలకు అండగా నిలిచిన రైతుబీమా పథకంపై కూడా ఆయన విమర్శలు చేశారు. “వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. కార్యకర్తలు, నాయకులు భయపడాల్సిన అవసరం లేదు” అని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పార్టీ శ్రేణులకు తాము అండగా ఉంటామని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పేర్కొన్నారు.

**22-ఏ నిషేధిత జాబితాపై స్పష్టత ఇవ్వాలి:**

మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలో సుమారు 400 ఎకరాల భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చారని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఇళ్లు, భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై కలెక్టర్, సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములను నిషేధిత జాబితాలో చేర్చి కబ్జాలకు, పర్సంటేజీలకు అవకాశం కల్పిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఇలాంటి వ్యవహారాలకు కారణమైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మంత్రులపై వస్తున్న అవినీతి ఆరోపణలపై కూడా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సతీమణి శారద, మహిళా కార్పొరేటర్లు ఆర్. జ్యోతి, సరస్వతి, మంజుల, మీరాబాయి, లక్ష్మి, నాయకురాళ్లు జ్యోతి, సుధాశ్రీ, సుధ, గాయత్రి, తిరుపతమ్మ, లావణ్య, ప్రతిభ, జహీదా భాను తదితరులతో పాటు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, రెహమాన్, మాజీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కురుమూర్తి గుట్టలపై 'మైనింగ్' ఆరోపణలు.. ప్రజాప్రతినిధుల తీరుపై ప్రజాగ్రహం

## - దేవుడి పేరుతో మట్టి, ఇసుక దందా చేస్తున్నారంటూ ఆరోపణలు..

## - 22-ఏ భూములపైనా సమగ్ర విచారణకు డిమాండ్



**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

దేవరకద్ర నియోజకవర్గంలోని శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం పరిసరాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోందని బీజేపీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. దేవస్థానం రోడ్డు కాంట్రాక్టు పేరుతో పెద్దగుట్ట నుంచి అనుమతులు లేకుండా మట్టి, ఇసుక తరలిస్తున్నారని, ఈ వ్యవహారంలో ప్రజాప్రతినిధుల అనుచరుల పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. శుక్రవారం కురుమూర్తి స్వామి దేవస్థానం పరిసరాల్లో బీజేపీ నాయకులతో కలిసి పర్యటించిన కొండ ప్రశాంత్‌రెడ్డి అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ అధికారుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. దేవస్థానం రోడ్డు నిర్మాణం పేరుతో గుట్టలు, చెరువుల నుంచి మట్టి, ఇసుకను తరలించడం సరికాదన్నారు. మైనింగ్‌కు సంబంధించి అవసరమైన అనుమతులు లేకుండానే గుట్టలను తవ్వుతున్నారని ఆరోపించారు. "కాంట్రాక్టు పనులకు మేము వ్యతిరేకం కాదు.. దేవస్థానాల గుట్టలను కొల్లగొట్టడానికే వ్యతిరేకం" అని ఆయన స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన మట్టిని నిబంధనల ప్రకారం ఇతర ప్రాంతాల నుంచి సమకూర్చుకోవాలని, ప్రభుత్వ భూములు, దేవస్థాన ఆస్తులకు నష్టం కలిగించేలా మట్టి తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కురుమూర్తి ప్రాంతంలో వన్యప్రాణులు, అడవి జంతువులు జీవిస్తున్నాయని, గుట్టలను ఇష్టారాజ్యంగా తవ్వడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై బీజేపీ నాయకులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు కనిపించడం లేదని విమర్శించారు.

**22-ఏ భూములపై స్పష్టత ఇవ్వాలి:**

దేవరకద్ర నియోజకవర్గ పరిధిలో సుమారు 400 ఎకరాల భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపైనా కొండ ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజలకు చెందిన భూములు, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడంపై జిల్లా కలెక్టర్, సంబంధిత రెవెన్యూ అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వెనుక అక్రమ ప్రయోజనాలు, కబ్జాలకు అవకాశం కల్పించే ప్రయత్నాలు ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలోనూ వివిధ అభివృద్ధి పనుల పేరుతో మట్టి తరలింపుపై ఆరోపణలు వచ్చాయని ప్రస్తావించిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ ఇలాంటి వ్యవహారాలు కొనసాగితే ప్రజలు తగిన సమాధానం చెబుతారని అన్నారు. అక్రమ మైనింగ్, మట్టి తరలింపుపై అధికారులు తక్షణమే స్పందించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యక్షులు కుర్వ రమేష్, భరత్ భూషణ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డాబా శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షుడు బడుగుల రాజేశ్వర్‌రెడ్డి, పబ్బా నరేందర్, అశోక్‌రెడ్డి, జంపి, లోకేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నేడు గట్టు చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

## రథోత్సవానికి భారీగా తరలిరానున్న భక్తులు

**గండీడ్:**

శ్రీ శ్రీ శ్రీ వరాహగిరి గట్టు చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు, రథోత్సవం, స్వామివారి పాదపూజ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 8 గంటల నుంచి అఖండ భజన కార్యక్రమం కొనసాగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి సేవల్లో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు రథోత్సవం, అనంతరం స్వామివారి పాదపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలను శుభ్రపరచడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ పవిత్ర బ్రహ్మోత్సవాల్లో భక్తులు కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో పాల్గొని చెన్నకేశవ స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, సభ్యులు విజ్ఞప్తి చేశారు.





# వెయ్యి రోజుల ప్రజా పాలనపై ప్రజల్లో సంతృప్తి

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతికి కృషి చేస్తోంది

**గండీడ్:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గండీడ్ మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యులు నరసింహారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ కొనసాగింది.వెన్నాచేడ్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ జానంపల్లి, గొల్లగడ్డ, రంగారెడ్డిపల్లి, సల్కార్‌పేట్, గండీడ్, అంచన్‌పల్లి, కొమిరెడ్డిపల్లి, దేశాయిపల్లి గేటు వరకు కొనసాగి తిరిగి గండీడ్‌కు చేరుకుంది. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో ర్యాలీలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రైతులకు పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు వంటి కార్యక్రమాలను అమలు చేస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ వారి సంక్షేమం, అభివృద్ధికి పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. వెయ్యి రోజుల ప్రజా పాలనను పురస్కరించుకుని మండలంలో నిర్వహించిన బైక్ ర్యాలీ విజయవంతం కావడం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గండీడ్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భగవంతు రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పుల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆశిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆశన్న, ఉపాధ్యక్షులు దిగంబర్ రావు, వెంకటేష్ సర్పంచులు చెన్నారెడ్డి, లక్ష్మారెడ్డి, దశరథ్ నాయక్, రఘు, టిక్యా నాయక్, కిష్టప్ప, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, బసప్ప, మాజీ సర్పంచులు బోయిని, గోపాల్, లక్ష్మారెడ్డి, నాయకులు వెంకట్రాంరెడ్డి, మన్యపు రెడ్డి, వెంకన్న గౌడ్, పులిందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గంగుల శ్రీనివాస్ రెడ్డి, మాలేకాడి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమారూర్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు...

## - ఉత్సాహంగా ఉట్లోత్సవం.. భజంత్రీలతో శోభాయాత్ర

## - ప్రత్యేక పూజలు, అన్నదానం.. పాల్గొన్న గ్రామ ప్రజలు

**చిన్నంబావి, సెప్టెంబర్ 4 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను యాదవుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలకు జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం యువత ఉత్సాహంగా ఉట్లోత్సవం నిర్వహించింది. యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను సందడిగా జరుపుకున్నారు. బాణసంచా కాలుస్తూ, భజంత్రీలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులు, గ్రామస్తులకు అన్నదానం చేపట్టారు.శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేష్, ఆవొత్తు నరసింహా, ఆటో వెంకటేష్, రిటైర్డ్ టీచర్ మోహన్ సార్, మూగి మోహన్ యాదవ్, జూరు కురుమయ్య, సాయిలు, జక్కుల తిక్కన్న, తూముకుంట మల్లయ్య, మేకల వెంకటయ్య, మూగి నరసింహా యాదవ్, లోకేష్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, మూగి మద్దిలేటి, బోనాసి మల్లికార్జున్, ప్రవీణ్,దర్గా తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఘనంగా జన్మాష్టమి వేడుకలు

**చిన్నంబావి, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండల పరిధిలోని గూడెం గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల నడుమ స్వామివారి ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ధర్మ పరిరక్షణ, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం శ్రీకృష్ణుడు అవతరించిన పవిత్రమైన రోజే జన్మాష్టమి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో దాత మేకల శాంతయ్య యాదవ్ తులం వెండి స్వామివారికి సమర్పించారు. అనంతరం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని బత్తుల మోహన్ యాదవ్ ముందుండి నిర్వహించారు. వేడుకల్లో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాదవ సంఘం నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# పెద్ద చింతరేవులలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## - పీఠాధిపతుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి లక్ష పుష్ప తులసి అర్చన

**గద్వాల సెప్టెంబర్ 04 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవులలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. 15వ,శతాబ్దం నాటి శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నప్రసాద సత్రంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉడిపి పలిమర్ పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాధీశతీర్థ శ్రీపాదుల వారు,శ్రీ 1008 శ్రీ విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి శాస్త్రోక్తంగా లక్ష పుష్ప తులసి అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు మాట్లాడుతూ, శ్రీకృష్ణుని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సర్వపాప హరణంతో పాటు సర్వప్రాప్తి కలుగుతుందని తెలిపారు. వేడుకల్లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీకృష్ణుని జన్మస్థలమైన గోకులం నమూనా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అర్చకులు ఆద్య వామనాచారి,ఆద్య కిష్టాచారి,ఆద్య మద్వాచారితో పాటు మహిళా భక్తులు,పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.





# పేపర్లలో ప్రకటనలు కాదు.. ప్రజలకు అభివృద్ధి చూపించండి!

## కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి సవాల్

**మాగనూరు, సెప్టెంబర్ 04(ప్రజా జ్యోతి)**

కాంగ్రెస్ ప్రభుత్వం పేపర్లలో కోట్లు తెచ్చామని గొప్పలు చెప్పుకోవడం మానుకుని, ప్రజలకు కనిపించేలా అభివృద్ధి చేసి చూపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివరాంరెడ్డి బీఆర్ఎస్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంపు గ్రామాలైన నెరడగం, భూత్పూర్ ప్రజల కోసం ఆర్‌అండ్‌ఆర్ సెంటర్లకు జీవో తీసుకొచ్చింది మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డేనని, జీవో రద్దు చేశారన్న ఆరోపణలకు ఆధారాలు చూపాలని శివరాంరెడ్డిని డిమాండ్ చేశారు. **"గత ప్రభుత్వం చేసింది.. మీరు ఏం చేశారు?"**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మక్తల్ 150 పడకల ఆసుపత్రి, ఫైర్‌స్టేషన్, కోర్టు, డిగ్రీ కళాశాల, చిట్యాలమందిపల్లి వంతెన తదితర అభివృద్ధి పనులకు అనుమతులు, నిధులు కేటాయించారని ఎల్లారెడ్డి గుర్తు చేశారు. ఉజ్జలి, సంఘంబండ, గార్లపల్లి ముంపు గ్రామాల లబ్ధిదారులకు రూ. 26.35 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసిన విషయంపై ఆధారాలు ప్రజల ముందు ఉంచాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో మాగనూరు మండలానికి చేసిన అభివృద్ధిని పేపర్లలో కాకుండా చేతల్లో చూపించాలని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో మంజూరైన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా పూర్తి చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఇప్పటికే మొదలైందని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు మరింత పెరుగుతుందని ఎల్లారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

